ఇది ప్రగతిశీల బడ్జెట్

మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్



కుత్బుల్లాపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గురువారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌పై ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ బడ్జెట్ దేశ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఊతమిచ్చే విధంగా ఉందన్నారు. వికసిత భారత్‌కు మూల స్తంభాలైన యువత, పేదలు, మహిళలు, రైతుల సాధికారతకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారని తెలిపారు. సామాన్య, పేద మధ్యతరగతి కుటుంబాలపై భారం పడకుండా వారి జీవన శైలిని సులభతరం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్ రూపొందించిందన్నారు. ప్రగతిశీల బడ్జెట్‌ని ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ భారీ సీట్లు గెలిచి ప్రధాని నరేంద్ర మోడీసారథ్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని శ్రీశైలంగౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

చార్వాక కేలండర్ ఆవిష్కరణ

జగద్గిరిగుట్ట: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సమస్యలను పట్టించుకోకుండా మత రాజకీయాలు చేస్తోందని వివిధ సంఘాల నేతలు ఆరోపించారు. జగద్గిరిగుట్టలోని సీపీఐ కార్యాలయంలో చార్వాక కేలండర్‌ను గురువారం ఆవిష్కరించారు. సీపీఐ కార్యదర్శి ఉమామహేష్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో అరుణోదయ అధ్యక్షుడు మోహన్ బైరాగి, మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం నాయకులు గ్యారా శ్రీనివాస్, జన విజ్ఞాన్ వేదిక కోశాధికారి వరప్రసాద్, నాస్తిక హేతువాదులు ప్రభాకర్, బుర్హాన్, రామస్వామి, పవీణ్, వెంకట్, హరినాథ్, కిషన్‌రావు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్‌ను వెంటనే ఖాళీ చేయాలి..

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ శ్రీనివాస్ నగర్ బస్తీ కమ్యూనిటీహాల్‌ను గత బస్తీ అధ్యక్షుడు లీజుకు ఇచ్చాడని, వెంటనే హాల్‌ను ఖాళీ చేయాలని సీపీఐ కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. గతంలో కమ్యూనిటీహాల్‌ని నిర్మించిన అనంతరం గత అధ్యక్షుడు సులేమాన్ అనే వ్యక్తి మీద దొంగతనంగా కరెంట్ మీటరు ఇప్పించి లీజ్‌కు ఇచ్చారని అన్నారు. బస్తీ వాసులు నిలదీస్తే సంవత్సరంలోపు ఖాళీ చేయిస్తానని చెప్పి విస్మరిస్తున్నాడని పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి హాల్‌ను ఖాళీ చేయించాలన్నారు. లేని పక్షంలో ఉద్యమిస్తామని పేర్కొన్నారు.



నిధులు మంజూరైనా.. పనులు సాగవు



ఇందిరాగాంధీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద డంప్ చేసిన పైపులు





ఇందిరాగాంధీనగర్‌లోని రెండు వీధుల్లో తవ్వి వదిలేసిన దృశ్యం

రంగారెడ్డినగర్: నిధులు మంజూరైనా నెలల తరబడి అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. స్థానికంగా మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు చేపట్టిన పనులు అధికారుల పర్యవేక్షణ లోపంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారుతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఇందిరాగాంధీనగర్‌లో రూ.62లక్షల నిధులతో భూగర్భ డ్రైనేజీ పనుల చేపట్టేందుకు గతేడాది సెప్టెంబరులలో శంకుస్థాపన చేశారు. అయితే కాంట్రాక్టర్ కాలయాపన, శాసనసభ ఎన్నికల కోడ్ తదితర కారణాలతో గత ఐదు నెలలుగా పనులు ముందుకు సాగలేదు.

◆ ఈ నేపథ్యంలో ఎట్టకేలకు జనవరిలో పనులు చేపట్టిన సదరు కాంట్రాక్టర్ రోడ్ల మధ్యలో పైపులైన్ వేసేందుకు కొద్ది మేర తవ్వి ఆపై పత్తా లేకుండా పోయాడు. పైపులైన్ కోసం తెచ్చిన పైపులను సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయ గోడ పక్కగా డంప్ చేశారు. 20 రోజులుగా ధ్వంసమైన రోడ్డుపైనే స్థానికులు రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. కాంట్రాక్టర్‌పై అధికారులకు పట్టు లేకపోవడంతోనే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డివిజన్ పరిధిలోని అనే ప్రాంతాల్లో ఇదే తరహాలో పనులు కొనసాగుతుండటం గమనార్హం.



ఇందిరాగాంధీనగర్‌లో భూగర్భ డ్రైనేజీ లైన్ కోసం వేసిన శిలాఫలకం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడనున్నాయని కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. నూజివీడు ఫీడర్ పరిధిలోని దూలపల్లి రోడ్డు, నాగార్జున హోమ్స్, నూజివీడు సీడ్స్ కంపెనీ, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు..

◆ జీబీఆర్ ఫీడర్ పరిధిలోని పీఎస్ఆర్ కన్వెన్షన్ రోడ్డు, రిలయెన్స్ పెట్రోల్ బంక్, సయ్యద్‌నగర్, ప్యారడైజ్ రోడ్డు, జీబీఆర్ కల్చరల్ క్లబ్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..

◆ ఎన్‌సీఎల్ ఫీడర్ పరిధిలోని కేవీఆర్ ఫంక్షన్‌హాల్ లేన్, విజయశాంతి ఎన్‌క్లేవ్, శివారెడ్డి గోదాములు, ఎన్‌సీఎల్ స్విమ్మింగ్ పూల్స్, ప్రజెయ్ అపార్ట్‌మెంట్స్, మనభూమి ఎన్‌క్లేవ్, వెన్‌సాయి అపార్ట్‌మెంట్స్‌లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు...

◆ కొంపల్లి సెక్షన్ పరిధిలోని కుమ్మరి బస్తీ, మున్సిపల్ కార్యాలయం, ఆంధ్రబస్తీ, సెంట్రల్ పార్క్ ప్రాంతాలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ **పేట్‌బషీరాబాద్ సెక్షన్ పరిధిలో..**

పైపులైన్ రోడ్డు, ప్రాగాటూల్స్, జయరామ్‌నగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాగాటూల్స్ కాలనీ, బీహెచ్ఈఎల్ విస్టా, ఆదిత్య విల్లాస్, హార్టికల్చర్ కార్యాలయ ప్రాంతం, ఎన్‌సీఎల్ అపార్ట్‌మెంట్స్, కోణార్క్ ఆస్పత్రి, వెన్నెలగడ్డ, దుర్గాఎస్టేట్స్, బౌద్ధనగర్, జయరామ్‌నగర్, చర్మాస్ ఇండస్ట్రీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..

◆ బాలాజీ ఆస్పత్రి, సత్యం ఎన్‌క్లేవ్ ఫీడర్ల పరిధిలోని కాంటన్ పార్క్, అంగడిపేట్, హైటెన్షన్ లైన్ రోడ్డు, సత్యం ఎన్‌క్లేవ్, దండమూడి ఎన్‌క్లేవ్, సురక్ష ఆస్పత్రి, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, ఆర్టీఏ కార్యాలయం ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేట్‌బషీరాబాద్ ఏఈ వినాయక్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు.

భౌరంపేట్ సబ్‌స్టేషన్ పరిధిలో....

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శుక్రవారం భౌరంపేట్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తనుందని ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. కేవీఆర్ ఫీడర్ పరిధిలోని కేవీఆర్ కాలనీ, స్ప్రింగ్‌వుడ్ కాలనీ, నేచర్ బౌంటీ, జెఎస్ఎస్ విల్లాస్, స్టెర్లింగ్ హోమ్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..

సాయినగర్ ఫీడర్ పరిధిలోని సాయినగర్, తెలుగు యూనివర్శిటీ, వీఎన్ఆర్ కాలేజీ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు..

బీవీఆర్ఐటీ ఫీడర్ పరిధిలోని పూజిత లేఅవుట్, సత్యం వ్యాలీ, సత్యం టవర్స్ ప్రాంతాల్లో విద్యుత్ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు సరఫరా ఉండదని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ తెలిపారు.

మెట్‌కానిగూడ, క్రషర్ ఫీడర్ల పరిధిలో..

సుభాష్‌నగర్: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని గాజులరామారం ఏఈ చైతన్యభార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు. మెట్‌కానిగూడ ఫీడర్ పరిధిలోని శ్రీవెన్ ఎన్‌క్లేవ్, ఓక్షిత ఎన్‌క్లేవ్, వీనస్ ఎన్‌క్లేవ్, దేవభూమినగర్, ఆదర్శ్ నగర్, మెట్‌కానిగూడ, పెద్దమ్మనగర్, కృష్ణమహాలక్ష్మినగర్, శారద కాలనీ, ఎలెగెన్స్ అపార్ట్‌మెంట్స్, చిత్తారమ్మ ఆలయ వెనుక గల్లీ, సోమిరెడ్డి వెంచర్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు..

◆ క్రషర్ ఫీడర్ పరిధిలోని గాజులరామారం గ్రామం, నరసింహ బస్తీ, దేవేందర్‌నగర్, ఆర్‌వీఎన్ఆర్ నగర్, బతుకమ్మ బండ, వీనస్‌రాక్ హైట్స్, కైసర్‌నగర్, లాల్‌సాబ్‌గూడ, ఏరో నగర్, పోచమ్మ బస్తీ, నర్సింహ బస్తీ, ఓక్షిత హిల్ వ్యూ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశం

నిజాంపేట్: బీఆర్ఎస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం ఈనెల 3న బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్‌హాల్‌లో జరుగనుంది. ఈ సమావేశం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన జరుగనున్న నేపథ్యంలో శుక్రవారం నిజాంపేట్ కొలన్ రాఘవరెడ్డి గార్డెన్స్‌లో ఉదయం 9గంటలకు మేయర్ కొలన్ నీలారెడ్డి ఆధ్వర్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కో.ఆప్షన్ సభ్యులు, అధ్యక్ష, కార్యదర్శులు, డివిజన్ల అధ్యక్షులు, అనుబంధ కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించనున్నారు.

కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదు



భాస్కర్‌కు రూ.1.5 లక్షల చెక్కును అందజేస్తున్న కార్మిక నాయకుడు చింతల నాగరాజు

కుత్బుల్లాపూర్: శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికుల పక్షాన తాను ఎల్లప్పుడు నిలబడతానని కార్మిక నాయకుడు చింతల నాగరాజు అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని శాస ఇంజినీరింగ్ కంపెనీలో భాస్కర్ అనే కార్మికుడు 8 సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. అనారోగ్యం కారణంగా కొన్ని రోజులు విధులకు గైర్హాజరయ్యాడు. దీంతో యాజమాన్యం అతన్ని విధుల నుంచి తొలగించింది. ఈ విషయాన్ని బాధితుడు చింతల నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి రూ.1.5 లక్షలను ఇప్పించాడు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. కార్మికులకు అండగా ఉంటానన్నారు. కార్మికులు ప్రమాదాల్లో గాయపడినా, అనారోగ్యాలపాలైనా పరిశ్రమల యాజమాన్యాలు ఆదుకోవాలన్నారు. తనకు న్యాయం చేసినందుకు బాధితుడి కుటుంబ సభ్యులు నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నివర్గాలకు న్యాయం.. కాంగ్రెస్‌తోనే సాధ్యం

సుభాష్‌నగర్: అన్ని వర్గాలకు సముచితం న్యాయం జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని పార్టీ సీనియర్ నాయకుడు బైరి భాస్కర్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వ సలహాదారుగా హరకర వేణుగోపాలరావు గురువారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అధిక సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని భాస్కర్ తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక



జగద్గిరిగుట్ట: రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు, ప్రొటోకాల్ పౌర సంబంధాలుగా నియమితులైన హర్కర వేణుగోపాల్‌ను పలువురు కలిసి అభినందనలు తెలిపారు. హెచ్ఏఎల్ కాలనీకి చెందిన సీనియర్ న్యాయవాది అనిల్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం





భక్తి గీతాలకు నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శివశివాని క్యాంపస్ గ్రౌండ్‌లో జరిగిన ఎస్‌పీఎస్ హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. కార్యక్రమాన్ని ప్రెసిడెంట్ హారతి సంపతి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శైలేష్ సంపతి, దీపిక సంపతి, హెచ్‌ఎం శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.



వైద్య సేవలు అందించడం అభినందనీయం



రాంకీ సంస్థ ప్రతినిధులతో కౌన్సిలర్ శంకర్‌నాయక్

దుండిగల్: తాండాల ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని కౌన్సిలర్ శంకర్‌నాయక్ అన్నారు. రాంకీ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నెల వార్డుల్లో ప్రజలకు మొబైల్ మెడికల్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నారు. గురువారం క్యాంప్‌ను సందర్శించిన శంకర్‌నాయక్ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఉచితంగా క్యాంప్ ఏర్పాటు చేయడంతో పాటు మందులను పంపిణీ చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఫ్యూజ్‌బాక్స్ దగ్ధం



దగ్ధమవుతున్న విద్యుత్ ఫ్యూజ్ బాక్స్

దుండిగల్: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఫ్యూజ్ బాక్స్ పూర్తిగా దగ్ధమయ్యింది. దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్‌లోని పెద్ద చెరువు కట్ట సమీపంలో శివాలయం దేవాలయం ఉంది. సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభానికి ఫ్యూజ్ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడి బాక్స్ నుంచి స్థానికంగా ఉన్న శివాలయంతో పాటు ఒక బోరుకు విద్యుత్ సరఫరా జరుగుతుందని స్థానికులు తెలిపారు. గురువారం ఉదయం ఒక్కసారిగా ఫ్యూజ్ బాక్స్‌ల నుంచి మంటలు చెలరేగాయి. దీంతో సమీపంలోని గుడిలో ఉంటున్న శివ మాలదారులు మట్టిని చల్లిని మంటలను ఆర్పివేశారు. ఈ క్రమంలో బాక్స్ పూర్తిగా కాలిపోయింది. ఈ విషయంపై సంబంధిత అధికారులకు సమాచారం అందించినా సంఘటన స్థలానికి ఎవరు రాలేదన్నారు. సకాలంలో స్పందించి మంటలను ఆర్పివేయడం కారణంగా గుడిలోని విద్యుత్ వైర్లకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని మాలదారులు పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు సకాలంలో స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

అడవుల పరిరక్షణ ప్రథమ కర్తవ్యం

- అటవీ జీవవైవిధ్య సంస్థ సంచాలకులు వెంకట్‌రెడ్డి
- రాష్ట్ర అటవీ అకాడమీలో 6వ బ్యాచ్ స్నాతకోత్సవం



ప్రతిభ కనబరిచిన సెక్షన్ అధికారులతో సంస్థ సంచాలకులు వెంకట్‌రెడ్డి తదితరులు



దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో పరేడ్ నిర్వహిస్తున్న శిక్షణ పూర్తి చేసుకున్న అటవీ సెక్షన్ అధికారులు

సుభాష్‌నగర్: ప్రస్తుత పరిస్థితుల్లో అడవులు, అటవీ భూములను పరిరక్షించడం సవాళ్లతో కూడుకున్నదని.. అటవీ అధికారులకు అడవుల పరిరక్షణ ప్రథమ కర్తవ్యమని అటవీ జీవవైవిధ్య సంస్థ సంచాలకులు వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో 6వ బ్యాచ్ అటవీ సెక్షన్ అధికారుల స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. మూడు నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న 34 మంది సెక్షన్ ఆఫీసర్లు పెరేడ్ నిర్వహించగా వెంకట్‌రెడ్డి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం శిక్షణలో భాగంగా ప్రతిభ కనబరిచిన అధికారులకు ఆయన పతకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

◆ కరీంనగర్ అటవీ డివిజన్‌కు చెందిన కె. సౌమ్య అత్యధిక మార్కులు పొంది బ్యాచ్ టాపర్‌గా నిలిచి 13 బంగారు పతకాలను సాధించారు. జి.రజిత 3పతకాలను,శోభారాణి, జరీనా, జి.రజినికాంత్, ఆర్.ధర్మ, ఎ.విజయ ఒక్కొక్కటి చొప్పున పతకాలను పొందారు. అనంతరం శిక్షణాధికారుల కోర్సు డైరెక్టర్, సి.హెచ్.గంగారెడ్డి కోర్సు రిపోర్టును సమర్పించారు.

◆ ముఖ్యఅతిథి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, అటవీ రక్షణల మధ్య సమతూకం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అడవులను కాపాడటంలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఆడవులపై ఒత్తిడిని తగ్గించడానికి ఆగ్రో-ఫారెస్ట్రీని ప్రోత్సహించాలన్నారు. దట్టమైన అడవులు సాంద్రతను కోల్పోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

◆ కలపేతర అటవీ ఉత్పత్తుల సంగ్రహణలో ప్రజలకు శాస్త్రీయ పద్ధతులను తెలియజేయాల్సిన బాధ్యత అటవీ అధికారులపై ఉందన్నారు. విశ్రాంత అటవీ అధికారులు, జి.రవీందర్, అటవీ అకాడమీ అదనపు డైరెక్టర్ ఎస్.రమేష్, సంయుక్త సంచాలకులు, బి. ప్రవీణ, డిప్యూటీ డైరెక్టర్లు ఆంజనేయులు, కె. శ్రీనివాస్, నాగిని బాను, సంగీత, రేంజ్ అధికారులు, సుభాష్ చంద్రయాదవ్, రామ్ మోహన్, డిప్యూటీ రేంజ్ అధికారి ఉమారాణి, సెక్షన్ అధికారి ప్రవీణ్‌కుమార్, ఫిజికల్ ట్రైనర్స్, రఫీ ఉల్లా, అశోక్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, అనిల్‌కుమార్, అటవీ క్షేత్రాధికారి, బీట్ అధికారి శిక్షణార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌తో సెల్ఫీ



అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన మాజీ సీఎం కేసీఆర్‌ను గురువారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ సీఎం యోగాక్షేమాలను తెలుసుకున్న వివేకానంద్ ఆయనతో సెల్ఫీ దిగారు. లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకునేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకుని స్థానిక కార్యకర్తలను సమాయత్తం చేయాలని మాజీ సీఎం సూచించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. – కుత్బుల్లాపూర్

కూన శ్రీశైలంగౌడ్‌ను కలసిన రాజస్థాన్ ఎమ్మెల్యే



కుత్బుల్లాపూర్: రాజస్థాన్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే శ్రీకేసారాం చౌదరి నగరానికి విచ్చేసిన సందర్భంగా గురువారం కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ను కొంపల్లిలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు రాజకీయ అంశాలతో పాటు, రాబోయే పార్లమెంట్ ఎన్నికల గురించి చర్చించారు. అనంతరం శ్రీకేసారాం చౌదరిని ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత, కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నాయకుడు బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ.. కబడ్డీ

- బాచుపల్లి వేదికగా జాతీయస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు
- చాంపియన్‌షిప్‌ను ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- అర్జున అవార్డు గ్రహీతలకు సత్కరించిన అతిథులు



కాసాని కౌసల్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ తదితరులు



జాతీయ స్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్న తెలంగాణ జట్టు

నిజాంపేట్: కాసాని కౌసల్య ముదిరాజ్ మెమోరియల్ 49వ జూనియర్ నేషనల్ కబడ్డీ చాంపియన్‌షిప్–2024 గురువారం రాత్రి బాచుపల్లిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు 30 రాష్ట్రల నుంచి బాల, బాలికల జట్లు వచ్చాయి. మొత్తం 60 జట్లు పోటీల్లో పాల్గొంటాయని మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్యానేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కాసాని కౌసల్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి అతిథులకు అభివాదం తెలిపారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు.

◆ అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను బాచుపల్లిలో నిర్వహిస్తున్న కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను ఆయన అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రీడలకు పెద్దపీట వేస్తూ సత్తా ఉన్న క్రీడాకారులను ప్రోతహిస్తున్నామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి త్వరలోనే కొత్త క్రీడా పాలసీని ప్రకటిస్తారని తెలిపారు. గతంలో టీవీల్లో క్రికెట్ చూసేవాడినని, ప్రస్తుతం లైవ్‌లో ప్రో కబడ్డీ పోటీలు చూడటం సంతోషంగా ఉందన్నారు.

◆ మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్యానేశ్వర్ మాట్లాడుతూ ...కబడ్డీ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలన్నారు. కబడ్డీ క్రీడా కారులను ప్రోత్సహించేందుకే ఈ పోటీలు నిర్వహించామన్నారు. సీనియర్ క్రీడాకారులకు ప్రో కబడ్డీ నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం అర్జున అవార్డు గ్రహీతలు రోమా సర్కార్, నితా, అనూప్ తదితరులను సన్మానించారు.

◆ ఈ కార్యక్రమంలో ఎకేఎఫ్ఐ ఉపాధ్యక్షుడు కాసాని వీరేష్‌ముదిరాజ్, మాజీ మంత్రి వేణుగోపాలాచారి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలను హన్మంత్‌రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు కాసాని సుధాకర్ ముదిరాజ్, కాసాని శిరీష, చిట్ల దివాకర్, సురేష్‌రెడ్డి, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



గోవా రాష్ట్ర బాలికల జట్టుతో స్పీకర్, నిర్వాహకులు

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన సముద్రాలను ఇవ్వాలి

ప్రారంభమైన ఇన్‌కాయిస్ డికేడ్ కాన్ఫరెన్స్

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని ఇన్‌కాయిస్‌లో నాలుగు రోజుల పాటు జరిగే ఇండియన్ ఓషన్ రీజనల్ డికేడ్ కాన్ఫరెన్స్–2024 గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఇంటర్ గవర్నమెంటల్ ఓషనోగ్రఫీ కమిషన్ ఆఫ్ యునెస్కో డాక్టర్ యుటకా మిచిండా, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైనెన్స్ ప్రభుత్వ సెక్రటరీ డాక్టర్ ఎం.రవిచంద్రన్, యూకేకు చెందిన ప్లేమౌత్ మెరైన్ లేబొరేటరీ ప్రతినిధి డాక్టర్ సుభాసత్యేంద్రనాథ్, ఇటలీకి చెందిన డికేడ్ కొలాబరేటీవ్ సెంటర్ ఫర్ కోస్టల్ రిసిలియన్స్ ప్రతినిధి నాడియా పినార్డీ, ఉడ్స్ హోల్ ఓషియోగ్రఫీ ఇనిస్టిట్యూషన్స్ యూఎస్ఏకు చెందిన డాక్టర్ కిలపర్తీ రామకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి ఇన్‌కాయిస్ డైరెక్టర్ శ్రీనివాసకుమార్ స్వాగతం పలికారు. ఏప్రిల్ 2024లో బార్సిలోనాలో జరిగే 2024 ఓషన్ డికేడ్ కాన్ఫరెన్స్ నేపథ్యంలో ఈ సదస్సు ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సముద్రాలు ఎన్నో అవకాశాలను కల్పిస్తున్నాయని అన్నారు. అయితే అందులో ఎన్నో సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. సముద్రాల వల్ల ఆహార ఉత్పత్తుల లభ్యతతో పాటు భూమిపై వాతావరణం ప్రభావితమవుతుందన్నారు. వాటి పరిరక్షణకు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన సముద్రాలను అందించడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు.